

సమస్య పరిష్కరించిన దానికి సంబంధించిన పత్రాన్ని అందిస్తున్న కలెక్టర్ నాగరాణి

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తాం

ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ శాంతి ప్రియ

భీమవరంలో జీపీఎఫ్, పెన్షన్ అదాలత్

భీమవరం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): సర్వీసులో ఉన్నా, పదవీ విరమణ చేసినా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తున్నామని అందులో భాగంగా మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఉద్యోగుల చెంతకే వచ్చే కార్యక్రమం చేపట్టినట్టు రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ కార్యాలయం ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఎస్.శాంతిప్రియ అన్నారు. శుక్రవారం భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా యంత్రాంగం రాష్ట్ర ఏజీ కార్యాలయం అధికారులతో ఏర్పాటు చేసిన జీపీఎఫ్, పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని శాంతిప్రియ, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ప్రతి నెల ఏజీ బృందం ఆయా జిల్లాలకు వస్తారని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించుకోవచ్చన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్ అదాలత్ నిర్వహించడం ద్వారా సర్వీసులో ఉన్న, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఎంతో ఉపయో గంగా ఉంటుందన్నారు. ఈ పెన్షన్ అదాలత్‌లో 36 మంది ఉద్యోగులకు పింఛన్ మంజూరు పత్రాలను అందించారు. 20 మంది వినతులు అందజేయగా 15 సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. జీపీఎఫ్ సమస్యలకు సంబంధించి 55 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ ఆశ్రిత పట్నాయక్, రాష్ట్ర ఖజానా, లెక్కల అధికారి డా.ఎస్. మోహనరావు మాట్లాడారు డీఆర్‌వో బి.శివన్నారాయణ రెడ్డి, ఏజీ కార్యాలయం సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

సదరం క్యాంపులు నిర్వహించాలి : కలెక్టర్

భీమవరం టౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పక్కాగా సదరం క్యాంపులను నిర్వహించి, దివ్యాంగ పెన్షన్ లబ్ధిదారుల అప్పీళ్ల మేరకు దివ్యాంగత్వం శాతాన్ని తిరిగి లెక్కింపు కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ నాగరాణి అధికారులను ఆదేశించారు. దివ్యాంగుల పించన్లు పునః పరిశీలనపై డీఎం హెచ్‌వో డాక్టర్ జి.గీతాబాయి, డీసీహెచ్ఎస్ పి.సూర్యనారాయణ, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డి నేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్, డీఆర్‌డీఏ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్‌లతో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో దివ్యాంగుల పెన్షన్ పునః పరిశీలన నిమిత్తం అప్పీలు చేసుకున్న 1,360 మందికి తిరిగి దివ్యాంగత్వ శాతం పరీక్షలను వైద్యులు పక్కాగా నిర్వహించి నివేదికలను సమర్పించాలన్నారు. తాడేపల్లిగూడెం, తణుకు, పాల కొల్లు, నరసాపురం, భీమవరం ప్రాంతాల్లో సదరం క్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు.



ముత్యాలపల్లిలో బాణసంచా తయారీ వస్తువులను స్వాధీనం చేసుకున్న పోలీసులు

అక్రమంగా బాణసంచా తయారీ

▸▸ పోలీసులు దాడి.. కేసు నమోదు

మొగల్తూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో దీపావళి పండుగను పురస్కరించుకుని అక్రమంగా పేలుడు బాణసంచా తయారీ చేస్తున్న యూనిట్‌పై శనివారం మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ముత్యాలపల్లికి చెందిన మామిడిశెట్టి బాబూరావు ఇద్దరు మహిళ సహకారంతో (ఫైర్ కాకర్స్) తయారు చేస్తున్నట్టు వచ్చిన ఫిర్యాదు మేరకు మొగల్తూరు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 2000 ఫైబర్ బాంబులు, నాలుగు కిలోల పొటాషియం పేలుడు పదార్థం, స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ జి.వాసు తెలిపారు. అక్రమంగా పేలుడు పదార్థాలు తయారీ చేస్తే కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శ్రీవేద హెచ్చరించారు.

సీహెచ్ పోతేపల్లిలో పామాయిల్ రిఫైనరీకి గ్రీన్‌సిగ్నల్

ఏలూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో ఫుడ్ ప్రోసెసింగ్ పరిశ్రమలు-ప్రత్యేక ప్రోత్సాహకాల్లో భాగంగా ఏలూరు జిల్లాలో ఆహార, పామాయిల్ ప్రోసెసింగ్ యూనిట్ల విస్తరణకు రాష్ట్ర కేబినెట్ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతేపల్లిలో క్రూడ్ పామ్‌కెర్నల్ ఆయిల్ రిఫైనరీకి, స్పెషాలిటీ ఫ్యాట్స్ యూనిట్‌కు ప్రభుత్వం రాయితీలు కల్పించేందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. చింతలపూడి మండలం సీతానగరం కేంద్రంగా సాగుతున్న ఎంఎస్ గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ ఈ ప్రాంతంలో 20 ఎకరాల్లో రూ.208 కోట్ల పెట్టుబడితో 66 మంది ఉద్యోగులతో బ్రాంచ్ విస్తరణకు రంగం సిద్ధం కానుంది. 1990 దశకంలోనే ఈ సంస్థ ఇక్కడ పామాయిల్ గెలల ప్రోసెసింగ్ రిఫైనరీకి స్థలాలను రైతుల నుంచి కొనుగోలు చేసింది. ఈ నేపథ్యంలో 20 ఎకరాల విస్తీర్ణంలో రిఫైనరీ విస్తరణ చేయడానికి దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. తాజాగా దీనికి అడుగులు పడను న్నాయి. దీంతో సమీపంలోని ద్వారకా తిరుమల, నల్లజర్ల, భీమడోలు, ఉంగుటూరు, గోపాలపురం తదితర మండలాల నుంచి ఈ ఫ్యాక్టరీకి ఆయిల్‌పామ్ గెలలను తరలించనున్నారు. అదే విధంగా జిల్లాలో ఆహార ప్రోసెసింగ్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం లభించింది. దీనిపై జిల్లా యంత్రాంగం కసరత్తు చేయనుంది.

రీసర్వేలో దిద్దుబాట

జిల్లాలో మూడో విడత రీసర్వే ప్రారంభమైంది. వైసీపీ హయాంలో తలెత్తిన సమస్యలు లేకుండా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంది. తాజా సర్వేలో 22 గ్రామాలను ఎంపిక చేశారు. రైతుల సహకారంతో రెవెన్యూ భూములను సర్వే చేసేలా ప్రణాళిక చేశారు. 300 మంది సిబ్బందిని నియమించారు. ఒత్తిడి, హడావుడి లేకుండా సర్వే నిర్వహించేలా 175 రోజులు గడువు విధించారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో చేసిన తప్పిదాలను పున రావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటోంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులను సరిదిద్దే ప్రయత్నాలు చేస్తోంది. మూడో తేదీ నుంచి మూడో విడత రీసర్వే నిర్వహిస్తున్నారు. మూడు నెలల్లో క్షేత్రస్థాయి సర్వే పూర్తి చేయాలి. మరో మూడు నెలల్లో వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ముందుగా రైతులకు నోటీసులు ద్వారా సర్వే విషయాన్ని తెలియపరిచాలి. రైతు సమక్షంలోనే సర్వే నిర్వహించాలి. కూటమి ప్రభుత్వం తొలినుంచి ఇదే పంథాను అనుసరిస్తోంది. ముఖ్యంగా ఆక్వా చెరువుల్లో హద్దులు లేకపోవడంతో భూమి అంతటికీ ఒకే ఎల్‌పీ నంబర్ ఇచ్చేశారు. దీనివల్ల రైతులు రుణాలు పొందకుండా పోయారు. భూమి అమ్ముకుందామన్నా అవకాశం లేకుండా పోయింది. ఇటువంటి తప్పిదాలకు కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. జాయింట్ ఎల్‌పీ నంబర్‌లు లేకుండా ముందుగానే చర్యలు తీసుకుంటున్నారు. హద్దులు లేకుండా భూములుంటే రైతులు దస్తావేజులు తేవాల్సి ఉంటుంది. దస్తావేజుల్లో ఉన్న భూమి వివరాలు, భూమి మొత్తం వివరాలకు సరిపోతే ప్రత్యేక ఎల్‌పీ నంబర్ కేటా యిస్తున్నారు. దస్తావేజు ఆధారంగా హద్దులను నిర్ణయిస్తూ ఎల్‌పీ నెంబర్ కేటాయిస్తుండడంతో రైతులకు ఎటువంటి సమస్య ఉండడం లేదు. అయితే రైతులు లేని పక్షంలో మాత్రం జాయింట్ ఎల్‌పీ నంబర్ ఇవ్వక తప్పడం లేదు. అక్కడ రైతులే ప్రత్యేక ఎల్‌పీ నంబర్‌కు దరఖాస్తు చేసుకోలేదంటూ రాస్తున్నారు.

మూడో విడతలో 22 గ్రామాలు ఎంపిక
300 మంది సిబ్బంది నియామకం
175 రోజులు గడువు
డాక్యుమెంట్‌లు సమర్పిస్తే ప్రత్యేక ఎల్‌పీ నంబర్ కేటాయింపు
వైసీపీ హయాంలో తప్పిదాలకు పరిష్కారం
6,590 జాయింట్ ఎల్‌పీ నంబర్‌లకు ఊరట



చింతపర్రులో సర్వే (ఫైల్)

విడతల వారీగా సర్వే

కూటమి ప్రభుత్వం రీసర్వేలో సకల జాగ్రత్తలు తీసుకుంటోంది. అధికారంలోకి రాగానే మండలానికి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసింది. సర్వే పూర్తి చేసింది. సత్ఫలితాలు వచ్చాయి. దాని ఆధారంగా రెండో విడతలో 27 గ్రామాలను ఎంపిక చేశారు. సదరు గ్రామాల్లోనూ సర్వే సక్రమంగా పూర్తి చేశారు. తాజాగా జిల్లాలో మరో 22 గ్రామాలను ఎంపిక చేసి సర్వే ప్రారంభించారు.వీఆర్‌వోలు, సర్వేయర్‌లతో సహా తహసీల్దార్ సైతం సర్వేలో భాగస్వాములు కానున్నారు.

6,590 దరఖాస్తులు పరిష్కారం

వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో 32 వేల జాయింట్ ఎల్‌పీ నంబర్‌లు కేటాయించారు. వాటికి కూటమి ప్రభుత్వం పరిష్కారం చూపుతోంది. ఈ ఏడాది 10,757 జాయింట్ ఎల్‌పీ నంబర్‌లను పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో 6,590 నంబర్‌లకు పరిష్కారం చూపారు. మరో 4,167 నెంబర్లు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చే ఏడాది మార్చిలోగా వాటికి కూడా వేర్వేరు ఎల్‌పీ నంబర్‌లు ఇవ్వాలి. అధికారులు రైతులతో సంప్రదింపులు జరుపుతున్నారు.

మూడో విడత రీసర్వే గ్రామాలివే

భీమవరం రెవెన్యూ డివిజన్ : దుంపగడప, అనాకోడేరు, కోమర్రు, వల్లూరు, బొండాడ, ఉండి, వీరవాసరం

తాడేపల్లిగూడెం : పెదతాడేపల్లి, బి.కొండేపాడు, రేలంగి

నరసాపురం : లక్ష్మణేశ్వరం, పొలమూరు, చింతపర్రు, ఎస్.చిక్కాల, నేరేడుమిల్లి, యలమంచిలి, చినమల్లం, పెనుమంత్ర, ఓడూరు, పండితవిల్లూరు, గుమ్మలూరు, ఆచంట వేమవరం .

ఇంటి కల !

ప్రభుత్వ లబ్ధి కోసం ఎదురు చూపులు
ఇళ్ల నిర్మాణాలకు దరఖాస్తులు
పెట్టుబడి పెట్టి కొంతమంది నిర్మాణాలు
గ్రామాల్లో 7,195 మంది దరఖాస్తు
పట్టణ పరిధిలో 595 ఇళ్లకు అనుమతి

భీమవరం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో సొంత ఇంటి కల నెరవేర్చుకునేందుకు ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సొంత స్థలాలు ఉన్న లబ్ధిదారులకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో అటు గ్రామాలతో పాటు పట్టణ పరిధిలో గృహాలు నిర్మించుకునేవారు ఇళ్ల నిర్మించుకునేందుకు ముందుకు వచ్చారు. అర్బన్ పరిధిలో 595 దరఖాస్తులు, గ్రామాల పరిధిలో 7,195 దరఖాస్తులు చేసుకున్నారు. పట్టణ పరిధిలోని 595 గృహాల మంజూరుకు ప్రభుత్వ అనుమతి లభించింది. గ్రామాల్లో ప్రభుత్వ మంజూరు కోసం చూస్తున్నారు. గృహ నిర్మాణ వ్యయం ప్రభుత్వం పెంచింది. గతంలో గృహ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ. 1.50 వేలు అందేది. పట్టణాల్లో రూ. 2.50 లక్షలకు పెంచడంతో లబ్ధిదారులు ముందుకు వస్తున్నారు. అర్బన్ పరిధిలో నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వ సహకారం బాగుంది. గ్రామాల పరిధిలో లబ్ధిదారులకు గృహ నిర్మాణానికి రూ. 2.50 లక్షలు వస్తుందని అంచనాలో లబ్ధిదారులు ఉన్నారు. ఇళ్ల మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు.

చాలాచోట్ల నిర్మాణాలు పూర్తి

గృహ నిర్మాణ మంజూరు కోసం దరఖాస్తులు చేసుకుని ఆరు నెలలైంది. దరఖాస్తు సమయంలోనే చాలా మంది లబ్ధిదారులు నిర్మాణాలు మొదలుపెట్టారు. కొన్ని గృహాలు పూర్తయిపోయాయి. మరికొన్ని సగంలో ఉన్నాయి. నిర్మాణ సమయంలో ప్రభుత్వం నుంచి సహకారం వస్తే నిర్మాణానికి ఉపయోగపడుతుందనే అంచనాలో చాలామంది ఉన్నారు. ఒక గృహ నిర్మాణానికి తక్కువ లెక్క వేసుకున్నా రూ. 6 లక్షల నుంచి రూ. 8లక్షలు పైగా అవుతుంది. దానిలో ప్రభుత్వం అందించే రూ. 2.50 లక్షలు తమకు ఆసరాగా ఉంటుందని లబ్ధిదారులు అంటున్నారు.




భీమవరం మండలంలో దరఖాస్తు చేసుకుని నిర్మాణం పూర్తయిన లబ్ధిదారుని గృహం

నియోజకవర్గాల వారీగా దరఖాస్తులు

ఉండి	1,102
తణుకు	803
తాడేపల్లిగూడెం	2,576
పాలకొల్లు	909
నరసాపురం	655
భీమవరం	995
ఆచంట	776

పన్ను వసూళ్లకు రెడీ

జిల్లాలో రూ.44.98 కోట్లు పెండింగ్
మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయం నుంచి అందిన జాబితాలు
వసూళ్లకు అధికారుల చర్యలు



భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) :మునిసిపాలిటీల్లో ఆస్తిపన్ను వసూళ్లలో చేపట్టిన సంస్కరణలో భాగంగా ప్రతీ మునిసిపాలిటీకి డీఎంఏ కార్యాలయంలో ప్రాపర్టీ టాక్స్ బోర్డు నుంచి పన్నులకు సంబంధించిన జాబితాలు మునిసిపాలిటీలకు చేరాయి. అసెసెమెంట్‌ల వారీగా జాబితాలు అందించటంతో అధికారులు వార్డుల వారీగా సచివాలయాలకు జాబితాలను అందించే పనిలో పడ్డారు. దీని ఆధారంగా ప్రణాళికాబద్ధంగా పన్నులు వసూలు చెయ్యాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతోపాటు కోటి రూపాయలు పైగా బకాయిలు ఉన్న మునిసిపాలిటీల్లోని సచివాలయాల జాబితాను విడుదల చేశారు. గత సెప్టెంబరు 30తో మునిసిపాలిటీల్లో మొదటి అర్ధ సంవత్సరం గడువు ముగియడంతో రెండో అర్ధసంవత్సరం ఆస్తి పన్ను వసూళ్లపై మునిసిపల్ రెవెన్యూ అధికారులు దృష్టి పెట్టారు. మొదటి దఫాకు సంబంధించి వడ్డీ లేకుండా జూన్ నెలాఖరు వరకు గడువు ఇచ్చారు. వడ్డీతో సెప్టెంబరు వరకు మొదటి దఫా పన్నులు చెల్లించవచ్చు. ఆ గడువు ముగియడంతో వసూళ్లకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం మునిసిపాల్టీలో బకాయిలతో కలిపి ఇప్పటి వరకు రూ.32.86 కోట్లు వసూలు చేయగా 44.98 కోట్లు వసూలు చేయాల్సి ఉంది.



మునిసిపాల్టీ	ఏడాది ఆదాయం	వసూలైంది	పెండింగ్
	(రూపాయలు కోట్లలో)		
భీమవరం	25.57	10.91	15.18
తణుకు	15.28	8.01	7.27
తాడేపల్లిగూడెం	16.49	6.82	9.67
పాలకొల్లు	8.87	3.42	5.46
నరసాపురం	8.09	2.68	5.41
ఆకివీడు	3.54	12.04	2.50
	77.84	32.86	44.98

అసమగ్రంగా అఫిడవిట్ !

▸▸ **మహిళ అదృశ్యం కేసు దర్యాప్తుపై వివరణ ఇచ్చేందుకు మా ముందు హాజరుకండి**

▸▸ **పశ్చిమ ఎస్పీ, ఇతర అధికారులకు హైకోర్టు ఆదేశం**



అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మంగాదేవి అనే మహిళ అదృశ్యమైన ఘటనలో కేసు దర్యా ప్తు పురోగతిపై జిల్లా ఎస్పీ దాఖలు చేసిన అఫి డవిట్ అసమగ్రంగా ఉందని హైకోర్టు తీవ్రంగా ఆక్షేపించింది. కేసు దర్యాప్తులో వాస్తవాలు వెల్ల డించడం లేదని అభిప్రాయపడుతూ వివరణ ఇచ్చేందుకు తదుపరి విచారణ రోజు తమ ముందు నేరుగా హాజరు కావాలని పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ, కొవ్వూరు డీఎస్పీ, తాడేపల్లిగూడెం ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. విచారణను అక్టోబరు 17కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం, కా మయ్యపాలేనికి చెందిన బండారు ప్రకాశరావు తన కుమార్తె మంగాదేవి కనపడడం లేదని 2012 అక్టోబరు 18న తాడేపల్లిగూడెం పోలీసుల కు ఫిర్యాదు చేశారు. తన కుమార్తె అదృశ్యం వెనుక అల్లుడు బ్రహ్మాజీ, అతని కుటుంబ సభ్యుల పాత్ర ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కుమార్తె అదృశ్యంపై సీబీడీ, కలెక్టర్, ఎస్పీ, హెచ్ఆర్సీలకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో 2017లో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచార ణకు రాగా ఫైలు ను పరిశీలించిన న్యాయమూర్తి.. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేసిన తీరుపై తీవ్ర అసం తృప్తి వ్యక్తం చేశారు. కేసు దర్యాప్తు పురోగతిపై తాజాగా నివేదిక సమర్పించాలని ఎస్పీని ఆదే శించారు. దానిని పరిశీలించిన అనంతరం కేసు ను సీబీఐకి అప్పగించే అంశంపై ఓ నిర్ణయానికి వస్తామని ప్రకటించారు. శుక్రవారం వ్యాజ్యం మరోసారి విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అల్లుడు మోహన్ బ్రాహ్మజీ, అతని కుటుంబ సభ్యులపై అనుమానం ఉందని పిటిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన ఐదేళ్ల తరువాత అల్లుడు స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డ్ చేశారన్నారు. పోలీసులు ఈ కేసును సక్రమంగా దర్యాప్తు చేయడం లేదన్నారు. కేసు దర్యాప్తు పురోగతిపై ఎస్పీ దాఖలు చేసిన అఫిడవిట్‌ను పరిశీలించిన న్యాయమూర్తి పిటిషనర్ అల్లుడు బ్రహ్మజీని పోలీసులు ఎందుకు ప్రశ్నించలేదు. ప్రశ్నిస్తే వివరాలను అఫిడవిట్‌లో ఎందుకు ప్రస్తావించ లేదని పోలీసుల తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. పోలీసుల తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది అజయ్ వాదనలు వినిపిస్తూ.. మహిళ అదృశ్యానికి సంబంధించిన దర్యాప్తు పురోగతి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేశామన్నారు. మంగాదేవి భర్త బ్రహ్మజీ స్టేట్‌మెంట్‌ను కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి కేసు దర్యాప్తు పురోగతిపై ఎస్పీ దాఖలు చేసిన అఫిడవిట్ అసమగ్రంగా ఉందని వ్యాఖ్యానించింది. వివరణ ఇచ్చేందుకు నేరుగా కోర్టు ముందు హాజరుకావాలని అధికారులను ఆదేశించింది.


జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్య సేవలు బంద్

భీమవరంటౌన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్‌టీఆర్ వైద్యసేవలు నిలిచిపోయాయి. బకాయిలు పేరుకుపోవడంతో తాము సేవలందిచలేమని వైద్యులు ప్రకటించారు. దీంతో జిల్లాలో 30 హాస్పిటల్స్‌లో సేవలు అందుబాటులో ఉండడం లేదు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం హాస్పిటల్స్‌లో ఎన్టీఆర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఎన్‌టీఆర్ వైద్యసేవలు అందించడంలేదని తమకు ఎటువంటి ఫిర్యాదులు రాలేదని ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి శ్రవణ్ తెలిపారు. బంద్ ప్రభావంపై డాక్టర్ కీర్తిని ప్రశ్నించగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేస్తున్నామని, అవసరమైతే దగ్గరలో ఉన్న ఆసుపత్రిలల్లో చేర్పించేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుతం ఎటువంటి ఫిర్యాదులు అందలేదని తెలిపారు.

నమో వేంకటేశా..

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధ్వజారోహణతో అంకురార్పణ.. శేష వాహనంపై శ్రీవారు



6

నక్కల డ్రెయిన్ ముంచేసింది

ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లో 400 ఎకరాల్లో కుళ్లిన వరి

ఏటా వర్షం, వరదలతో రైతులకు తప్పని నష్టం




ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణ

నమో వేంకటేశా..

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ధ్వజారోహణతో అంకురార్పణ.. శేష వాహనంపై శ్రీవారు



కోనసీమ తిరుమల వాడపల్లి కాంతులీనింది. వేదమంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవిందనామ స్మరణతో మార్మోగింది. చందన స్వరూపుడైన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవానికి అంకురార్పణ జరిగింది. ఆలయ ముఖ, వసంత మండపాల్లో ఫల, పుష్ప అలంకరణలు సుగంధ పరిమళాలు వెదజల్లాయి.

ఆత్రేయపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు శుక్రవారం ఉదయం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం స్వస్తి వచనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహావచనం, రుత్విక్‌వరుణ, దీక్షాధారణ, అకల్మష హోమం, అగ్ని ప్రతిష్ఠాపనలను శాస్త్రయుక్తంగా నిర్వహించారు. సాయంత్రం విశ్వక్సేన పూజ, వాస్తు పూజ, హోమాలు చేశారు. వసంత మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, రాత్రి ధ్వజారోహణం ఎగురవేశారు. ధ్వజ పీఠాన్ని మేళతాళాలలో ఊరేగించి దేవతలను ఆహ్వానించారు. శ్రీవారు పరావాసుదేవ అలంకరణలో శేష వాహనంపై తిరువీధుల్లో విహరించారు.

9 రోజులు జరిగే బ్రహ్మోత్సవాలకు భద్రతా ఏర్పాట్లను ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనా పరిశీలించారు.


నిత్య కల్యాణ మండప ఆవరణలో శ్రీవారు, అమ్మవార్ల కల్యాణ తంతు

నేత్రపర్వం.. శ్రీవారి కల్యాణం

ద్వారకాతిరుమల, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిలిచిన నిత్యార్జిత సేవలు శుక్రవారం పునః ప్రారంభమయ్యాయి. ఈ నెల 2నుంచి 9వరకూ బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈ రోజుల్లో స్వామివారి ఆలయంలో ఆర్జిత సేవలు నిలిచిపోయాయి. గురువారం రాత్రి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తం కావడంతో నిత్యార్జిత కల్యాణాలు, ఇతర ఆర్జిత సేవలు శుక్రవారం ప్రారంభమైనట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. నిత్యార్జిత కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణ తంతు ఆలయ అర్చకులు వైభవంగా జరిపారు.

13న వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవం

ఏలూరు రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):వ్యాసాశ్రమం స్థాపించి 100 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా ఏలూరులో శతాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కళారత్న కేవీ.సత్యనారాయణ తెలిపారు. అసంగానంద గిరి స్వామీజీ శుక్రవారం కేవీ సత్యనారాయణ నివాసానికి వచ్చారు. వ్యాసాశ్రమ శతాబ్ది ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 13న ఏలూరు కన్యకా పరమేశ్వరి సత్రంలో ఉత్సవాలు జరుగుతాయన్నారు. ఉదయం హోమాలు, స్వామి వారి దివ్య సందేశం ఏర్పాటు చేసినట్లు కేవీ.సత్యనారాయణ తెలిపారు.


ఏలూరు బస్టాండ్ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు




నాన్‌స్టాప్ బస్ టిక్కెట్ కౌంటర్ వద్ద, బస్టాండ్ నుంచి బయటకు వచ్చే మార్గంలో నీరు

ఈ బస్టాండ్‌లో అడుగు పెట్టలేం!

ఏలూరు ఆర్టీసీ కొత్త బస్టాండ్ నిర్వహణలో జిల్లా స్థాయి స్వచ్ఛత అవార్డు సొంతం చేసుకుంది. బస్టాండ్ నిర్వహణ, సౌకర్యాలు ప్రయాణికులకు అనువుగా ఉన్నాయి. కానీ బస్టాండ్ ఆవరణను పట్టించుకునే వారే లేరు. బస్టాండ్‌లో అడుగు పెట్టడానికి ప్రయాణికులు ఎన్ని అవస్థలు పడుతున్నారో ఎవరికీ పట్టదు. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతుంది. రోజుల తరబడి నిల్వ ఉండడంతో దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్‌కు వచ్చేవారు.. బస్సు దిగి బయటకు వెళ్లే వారు సర్కస్ ఫీట్ చేయాల్సిందే. బస్సులు ఆ నీరు చిమ్ముకుంటూ వెళుతున్నాయి. బస్టాండ్ పరిసరాలపై అధికారులు శ్రద్ధ వహించాలి. - ఫొటోగ్రాఫర్/ఏలూరు



నక్కల డ్రెయిన్ ముంచేసింది


ఎ.వేమవరంలో ముంపుబారిన పడి కుళ్లిపోయిన నాట్లు

ఆచంట, పోడూరు, యలమంచిలి మండలాల్లో 400 ఎకరాల్లో కుళ్లిన వరి


నీట మునిగిన చేలు (ఫైల్)

నక్కల డ్రెయిన్ శివారు ఆయకట్టు ఏటా ముంపు బారిన పడడంతో రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. సార్వా సీజన్‌లో భారీ వర్షాలు.. గోదావరి వరదకు నక్కల డ్రెయిన్ పొంగి వరి చేలను ముంచేస్తోంది. డ్రెయిన్ పూడిక, తూడుతో వందల ఎకరాలకు ముంపు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం డ్రెయిన్లను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో ఈ ఏడాది సమస్య మరింత తీవ్రమైంది. ప్రస్తుత సార్వా సీజన్‌లో నాట్లు మునిగి పోవడంతో రెండుసార్లు నాట్లు వేశారు. మళ్లీ మునగడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

- వర్షం, వరదలతో మునుగుతున్న చేలు
- వరి రైతులకు ఏటా తప్పని నష్టం
- ప్రస్తుత సార్వా సీజన్‌లో రెండుసార్లు ముంపు
- కుళ్లిపోయిన వరి నాట్లు

యలమంచిలి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):నక్కల డ్రెయిన్ రైతులకు పెను శాపంగా మారింది. తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కాకరపర్రు వద్ద మొదలైన నక్కల డ్రెయిన్ సుమారు 40కిలోమీటర్లు ప్రవహించి యలమంచిలి మండలం వడ్డిలంక వద్ద గోదావరిలో కలుస్తోంది. ముదుగు కాలువ దిగువన సుమారు 35 వేల ఎకరాల్లో వరి సాగవుతుంది.

ఏటా ఖరీఫ్ సీజన్ ఆగస్టు, సెప్టెంబరులో అధిక వర్షాలు, గోదావరి వరదలకు నక్కల డ్రెయిన్ నిలిచిపోయి వరి చేలను ముంచెత్తుతోంది. డ్రెయిన్‌లో పూడిక, గుర్రపుడెక్క, తూడు పేరుకుపోవడంతో వరద సమయంలో డ్రెయిన్ ఎగదన్ని చేలు నీట మునుగుతున్నాయి. చేలల్లో ముదుగు బయటకు పారక నాట్లు కుళ్లిపోతున్నాయి. డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న ఆచంట వేమవరం, గుమ్ములూరు, వద్దిపర్రు, కాంబొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో చేలు ముంపుబారిన పడుతున్నాయి.

రెండు సార్లు నాట్లు వేసినా..

ఈ ఏడాది సార్వా సీజన్‌లో ఆచంట వేమవరం, గుమ్ములూరు, వద్దిపర్రు, కాంబొట్లపాలెం, చింతదిబ్బ గ్రామాల పరిధిలో నక్కల డ్రెయిన్‌ను ఆనుకుని ఉన్న సుమారు 400 ఎకరాల్లో వరి పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రాంతాల్లో రైతులు ఆగస్టులో నాట్లు వేశారు. కొద్ది రోజులకే భారీ వర్షాలు, వరదతో చేలు మునిగి నాట్లు కుళ్లి పూర్తిగా దెబ్బతిన్నాయి. తర్వాత రైతులు సెప్టెంబరులో రెండోసారి నాట్లు వేశారు. మళ్లీ వర్షాలు, వరదతో వరి చేలు వారం రోజులకు పైగా ముంపులో ఉన్నాయి. నాట్లు కుళ్లిపోవడంతో రైతులు చూస్తూ ఉండిపోయారు. అప్పులు తెచ్చి పెట్టిన పెట్టుబడి నీటిపాలవడంతో కన్నీరే మిగిలింది.

గట్లు పటిష్టత గాలికొదిలేశారు..

నక్కల డ్రెయిన్ ముంపు సమస్య పరిష్కారానికి 2019లో టీడీపీ ప్రభుత్వం రూ.17 కోట్ల అంచనాతో గబియన్‌వాల్ (గట్టు పటిష్టత) నిర్మాణం, ఆధునీకరణ పనులు ప్రారంభించారు. సుమారు 2.5 కిలోమీటర్ల మేర గబియన్‌వాల్ నిర్మించేందుకు ప్రతిపాదనలు జరిగాయి. ముంపు సమస్య తీరునుందని అప్పట్లో రైతులు ఆశ పడ్డారు. సుమారు 10శాతం పనులు పూర్తయిన దశలో ప్రభుత్వం మారింది. వైసీపీ ప్రభుత్వం గబియన్ వాల్ నిర్మాణం, డ్రెయిన్ ఆధునీకరణ పనులను గాలికొదిలేసింది. ఐదేళ్ల పాటు సమస్య మరింత తీవ్రం కావడంతో రైతులు నిండా మునిగిపోతున్నారు. ప్రస్తుత పంట నష్టంపై రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని రైతులు ఎదురు చూస్తున్నారు.

నష్టాన్ని అంచనా వేస్తున్నాం



వరదలు, భారీ వర్షాలతో దెబ్బతిన్న వరి పంట దెబ్బ తింది. పంట నష్టంపై ఎన్యూమరేషన్ జరుగుతోంది. ఈ నెల 16వ తేదీలోగా పంట నష్టం వివరాలను నమోదు అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

పీవీవీఎన్ఎస్‌పీ ప్రసాద్, ఏడీఏ


నక్కల డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్క

ప్రభుత్వం ఆదుకోవాలి



ఐదు ఎకరాల్లో వరిసాగు చేస్తున్నాను. రెండు సార్లు నాట్లు వేశాం. రెండు సార్లూ ముంపుతో నాట్లు కుళ్లిపోయాయి. సుమారు రూ.50వేలు పైగా పెట్టుబడి పెట్టాను. రూపాయి కూడా రాని దుస్థితి . నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

దొంగ రాంబాబు, కౌలు రైతు, ఆచంట వేమవరం

డ్రెయిన్ ఆధునీకరించాలి



మూడున్నర ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాను. రెండుసార్లు వేసిన నాట్లు కుళ్లిపోవడంతో ఏం చేయాలో తోచని పరిస్థితి. ఏటా సార్వా సీజన్‌లో ముంపుతో నష్టపోతున్నాం. ప్రభుత్వం డ్రెయిన్ ఆధునీకరణ పూర్తిచేసి, రైతులను ఆదుకోవాలి.

అనిశెట్టి నారాయణమూర్తి, రైతు, కాంబొట్లపాలెం

ముంపుతో అప్పులపాలయ్యాం



ఐదు ఎకరాల్లో నాట్లు వేశాను. ముంపుబారిన పడి కుళ్లిపోయాయి. మళ్లీ రెండోసారి నాట్లు వేశాను. మరోసారి మునిగి నాట్లు కుళ్లిపోవడంతో తీవ్రంగా నష్టపోయాం. అప్పుతెచ్చి పెట్టిన పెట్టుబడి నీళ్లపాలయింది. ఏటా సార్వాలో నష్టాలబారిన పడి అప్పులపాలవుతున్నాం.

- కె.వెంకన్న, కౌలురైతు, ఆచంట వేమవరం

లక్ష్య సాధనలో దూసుకుపోతున్న బాలికలు


రమ్యకు గ్రామస్తుల స్వాగతం

తణుకు/దెందులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాలికలు అవకాశాలను అందిపుచ్చుకుని లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నారు. పురుషులకు ఏమాత్రం తక్కువ కాదని సవాల్ విసురుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంబంధిత రంగాల ప్రోత్సా హంతో అద్భుత విజయాలు సాధిస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌కు బాట వేసేలా వెన్నంటి ఉంటున్నారు. నేడు ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా పలు రంగాలలో విజయం సాధిస్తున్న బాలికల మనోగతం..

నేడు అంతర్జాతీయ బాలికా దినోత్సవం

దెందులూరు మండలం పోతునూరు పంచాయతీ పరిధిలోని ఉండ్రాజవరం గ్రామానికి చెందని కంటుబోతు రమ్య బీఎస్ఎఫ్ జవాన్‌గా ఎంపికైంది. రమ్య విజయంతో గ్రామం మొత్తం సంతోషంతో ఉక్కిరి బిక్కిరి అయింది. శిక్షణ పూర్తి చేసుకుని శుక్రవారం ఇంటికి వచ్చిన రమ్యకు గ్రామస్తులంతా పూలు చల్లి స్వాగతం పలికారు. కంటుబోతు నాగు, పద్మ దంపతుల కుమార్తె రమ్య డిగ్రీ చదివింది. దేశ రక్షణపై మక్కువతో నిరంతర సాధన చేస్తూ 2022లో బీఎస్ఎఫ్‌కు దరఖాస్తు చేసింది. అన్ని పరీక్షల్లో రమ్య విజయం 2023లో బీఎస్ఎఫ్‌కు ఏడాది పాటు శిక్షణ పూర్తి చేసుకుంది. స్వగ్రామానికి వచ్చిన రమ్యకు హారతులు పట్టిన గ్రామస్తులు మురిసిపోయారు. ఆమె తమ గ్రామానికి గర్వకారణమని గ్రామస్తులంటే, తన లక్ష్య సాధనలో కఠోర శ్రమతో ముందుకు సాగినట్లు రమ్య చెప్పింది. బాలికా దినోత్సవాన ఆమె రాక తమకు పండగ అని గ్రామస్తులంతా అభినందనలు తెలిపారు.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి : మైత్రి దాసు



జాతీయ, జిల్లా స్థాయి హాకీలో అనేక మెడల్స్ సాధించాను. ఇన్‌లైన్ హాకీ 36వ స్టేట్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించాను. 61వ నేషనల్ చండీఘర్‌లో జరిగిన నేషనల్ పోటీలలో రన్నర్‌గా నిలిచాను. 37వ రాష్ట్రస్థాయి పోటీలలో బ్రాంజ్ మెడల్, 62వ నేషనల్స్ కొయంబత్తూర్‌లో జరిగిన పోటీలలో గోల్డ్ మెడల్ సాధించా. ఇంటర్నేషనల్ ప్లేయర్‌గా ఎదగడమే లక్ష్యం.

ఏషియా గేమ్స్‌లో ఆడటమే లక్ష్యం : పి.అమూల్య



భవిష్యత్‌లో ఏషియా గేమ్స్‌లో ఆడటమే నా ముందున్న లక్ష్యం. 2023లో స్కేటింగ్‌లో రోలర్ హాకీతో ప్రారంభించాను. అదే సంవత్సరం రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించాను. మిక్సిడ్‌లో బ్రాంజ్ మెడల్, చండీఘర్‌లో 61వ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొన్నాను. 2024లో స్టేట్‌లో రెండు బ్రాంజ్‌లు, అదే సంవత్సరం 62వ నేషనల్ పోటీలకు ఎంపికయ్యాను. చెన్నైలోని కొయాంబత్తూర్‌లో పోటీలలో పాల్గొన్నాను.

ఆర్చరీలో జాతీయ స్థాయికి.. కె.రేనా సమీక్షా రెడ్డి



ఆర్చరీ పోటీలలో జాతీయ స్థాయిలో ఆడాలని ఉంది. పది, పదిహేను మీటర్ల దూరం పోటీలలో అత్యధిక స్కోరు చేసి సిల్వర్ మెడల్ సాధించాను. మిక్స్ ఆంధ్రప్రదేశ్ పోటీలలో గోల్డ్‌మెడల్ సాధించాను. 12వ ఎన్‌టీపీసీ చెరుకూరి లెనిన్, వోల్గా మెమోరియల్ మినీ అండర్-14, 4, 9 నేషనల్ ఆర్చరీ చాంపియన్‌షిప్ పోటీలలో పతకాలు సాధించాను.

పైలట్ కావడమే లక్ష్యం : కె.లహరి



భవిష్యత్‌లో పైలట్ అవ్వాలని లక్ష్యం. పాఠశాల స్థాయి నుంచి ఎన్‌సీసీలో చేరాను. క్రమశిక్షణతో పాటు అన్ని విధాలుగా తమ స్కూలు మాంటిస్సోరీ స్కూలు నేర్పుతున్నారు. ఇందులో భాగంగా స్కూలులో ఎన్‌సీసీలో చేరి శిక్షణ పొందుతున్నాను. నాకు చాలా బాగా ఉపయోగపడుతుంది.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి

ఏపీ నిట్‌లో టెక్రియా 2025 ప్రారంభం



తాడేపల్లిగూడెం అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని, వినూత్న పరిశోధనలతో నూతన శిఖరాలను అధిరోహించాలని ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ.రమణారావు అన్నారు. తాడేపల్లిగూడెం ఏపీ నిట్‌లో టెక్రియా 2025 కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. రమణారావు మాట్లాడుతూ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి నూతన ఆవిష్కరణలను చేపట్టాలన్నారు. ఆలోచనలకు పదును పెడితే ఎన్నో అద్భుతాలను సాధించవచ్చన్నారు. కొలువుల సాధనకు నైపుణ్యాలే కీలకమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తం అన్నారు. అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వరరెడ్డి కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. అనంతరం ఇన్‌చార్జి డైరెక్టర్ రమణారావును శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ కే.హిమబిందు కార్యదర్శి వేదంత రెడ్డి, డీన్‌లు వి.సందీప్, ఎన్.జయరాం, కార్తీక్ శేషాద్రి, వీరేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన విద్యార్థుల ప్రదర్శనలు

నిట్ విద్యాసంస్థల్లోని క్లబ్‌లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో నిర్వహించిన పలు సాంకేతిక ప్రదర్శనలు, గేమ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈఈఈ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎక్స్‌పో, నేచర్ క్లబ్ ఆధ్వర్యంలో నేచర్ హంట్, స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో గన్ షూటింగ్, రింగ్స్, మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టెక్నికల్ క్విజ్, 3డీ ప్రింగ్ లేజర్, ఎన్గ్రేవింగ్, ఫొటోగ్రఫీ ఆధ్వర్యంలో విజన్ టెక్ తదితర కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలను తిలకించేందుకు పలు విద్యాసంస్థల నుంచి విద్యార్థులు భారీగా హాజరయ్యారు.

ఆకట్టుకున్న డ్రోన్ చాలెంజ్

మెకానికల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రోన్ చాలెంజ్ గేమ్ అందరినీ ఆకట్టుకుంది. ఈ గేమ్‌లో ఐదు దిశలుంటాయి. ఇవి ఎత్తుగాను, పల్లంగాను, గుండ్రంగా దగ్గరి దగ్గరగా ఉంటాయి. గేమ్‌లో పాల్గొన్న వ్యక్తి రిమోట్ సాయంతో డ్రోన్ నడుపుతూ కింద పడిపోకుండా నిర్ణీత సమయంలో ఐదు దశలను దాటుకుని ముందుకు వెళ్లాలి. ఎవరైతే తక్కువ సమయంలో నిర్దేశిత లక్ష్యంతో చేరిన వారిని విజేతలుగా ప్రకటించారు.


డ్రోన్ చాలెంజ్‌లో ఉత్సాహంగా పాల్గొన్న ఇంజనీరింగ్ విద్యార్థులు

స్మార్ట్ సిటీ ప్రత్యేక ఆకర్షణ

సివిల్ ఇంజనీరింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తక్కువ ప్రదేశంలో భవన సముదాయాలతో నిర్మించిన స్మార్ట్ సిటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణ, విద్యుత్ ఆదా, సోలార్ పవర్ సిస్టం, వర్షపు నీటిని ఒడిసి పట్టుకోవడం అంశాలతో నిర్మించిన భవన నిర్మాణ నమూనాలు ఆకట్టుకున్నాయి. భవనం లోపలికి అడుగు పెట్టగానే లైట్లు వెలిగే విధంగా.. తిరిగి బయటకు వెళ్లగానే లైట్లు ఆరిపోయే విధంగా సాంకేతికత విద్యార్థుల ప్రతిభను చాటింది.



సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థుల స్మార్ట్ సిటీ ప్రదర్శన

అక్కసుతోనే వైసీపీ దుష్ప్రచారం : బొలిశెట్టి



ఏలూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో మెడికల్ కళాశాలలను పీపీపీ విధానంలో ఇస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో వైసీపీ దానిపై దుష్ప్రచారం చేస్తోందని తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం ఏలూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల నిర్మాణానికి రూ.1,000 కోట్లు, తాడేపల్లిగూడెం నియోజకవర్గంలో నేషనల్ హైవే కనెక్టివిటీకి రూ.4.90 కోట్లు, ఎర్ర కాలువ అభివృద్ధికి మరో మూడు కోట్ల రూపాయలు మంజూరు చేయడంపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. జగన్ మాటలు నమ్మి మరోసారి మోసపోయేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. వైసీపీ హయంలో కల్తీ మద్యం ఏరులైపారి జంగా రెడ్డిగూడెంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు. టీడీపీ నాయకుడు ఘంటా ప్రసాదరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల్లో కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించినట్టు తెలిపారు.

13న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ మేళా

ఏలూరు అర్బన్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):కేంద్ర సాంకేతికాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 ఉదయం 10 గంటలకు ఏలూరు ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటీస్ షిప్ మేళా నిర్వహిస్తున్నామని, ఇందులో ప్రముఖ కంపెనీలు హాజరవుతాయని ప్రిన్సిపాల్ డి.భూషణం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్ పాస్/ఫెయిల్, ఐటీఐ, డిప్లొమా లేదా ఏదైనా వృత్తి విద్యాకోర్సు పూర్తిచేసిన విద్యార్థులు మేళాలో పాల్గొనవచ్చునన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08812-230269లో సంప్రదించాలని కోరారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న యశస్వి

తూర్పుకాపులకు ఓబీసీ సర్టిఫికెట్ల సాధనకు కృషి

ఏలూరు రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఓబీసీ సర్టిఫికెట్ల సాధనకు తూర్పు కాపులంతా ఐక్యంగా ముందుకు రావాలని రాష్ట్ర తూర్పు కాపు అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ ఛైర్మన్ పాలవలస యశస్వి పిలుపునిచ్చారు. శుక్రవారం ఏలూరు జడ్పీ సమావేశ మందిరంలో కార్పొరేషన్ ద్వారా అమలయ్యే పథకాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఓబీసీ సర్టిఫికెట్ల మంజూరుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు పిడకల రామారావు, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అప్పారావు, కరణం పెద్దిరాజు, రాష్ట్ర నాయకులు చనుమో చంద్రశేఖర్, బలగం సీతారాం, మరగాని అప్పారావు, బంకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముళ్లపూడి రేణుక, చిత్రంలో బీజేపీ నాయకులు

ఆత్మ నిర్భర్ భారత్‌పై విస్తృత ప్రచారం : రేణుక

ఏలూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఆత్మ నిర్భర్ భారత్‌లో భాగంగా ప్రజలు, యువత, మహిళలకు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో విస్తృత ప్రచారాన్ని కల్పించేలా సెప్టెంబరు 25 నుంచి డిసెంబరు 10వ తేదీ వరకు 90 రోజుల అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కార్యాచరణ అమలు చేస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధికారి ప్రతినిధి ముళ్లపూడి రేణుక తెలిపారు. ఏలూరులో శుక్రవారం ఆమె విలేకరులు, ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కమిటీ సమావేశాల్లో మాట్లాడారు. ప్రధాని స్వదేశీ వస్తువుల తయారీ పరిశ్రమలకు మరింత ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్, ప్రధాన కార్యదర్శులు సత్యనారాయణ, రాంబాబు, కన్వీనర్ కల్యాణ చక్రవర్తి, కట్నేని కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'అపెస్సా' ఏలూరు జిల్లా నూతన కార్యవర్గం



అధ్యక్షుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్స్ స్టాటిస్టికల్ సబార్డినేట్ సర్వీసెస్ (అపెస్సా) ఏలూరు జిల్లా యూనిట్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. శుక్రవారం జిల్లా అర్థగణాంక అధికారి కార్యాలయంలో జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా కొయ్యూరు గాంధీ, ఉపాధ్యక్షులుగా కె వసుధ, జనరల్ సెక్రటరీగా ఇందిరా ప్రియదర్శిని, సంయుక్త కార్యదర్శిగా బి. ప్రభాకరరావు, ట్రెజరర్‌గా ఎం. ప్రభావతి ఎంపికయ్యారు. నూతన అధ్యక్షుడు గాంధీ మాట్లాడుతూ మండలంలో సహాయ గణాంక అధికారులకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. సీపీఓ ఎన్నికల అధికారిగా వ్యవహరించారు.

ఆరోగ్య పరిరక్షణకు గుడ్డు దోహదం



గుడ్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ ఆనందరావు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): వెంకట్రామన్నగూడెం బపెల్లో రీసెర్చ్ సెంటర్ వద్ద శుక్రవారం గుడ్డు దినోత్సవం నిర్వహించారు. పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ కె.ఆనందరావు మాట్లాడుతూ ప్రతి ఏటా మనిషి 180 గుడ్లు తినడం వల్ల మంచి ఆరోగ్యం సమకూరుతుందన్నారు. ప్రకృతి ప్రసాదించిన అనేక పోషక విలువలుగల గుడ్డు అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. సీనియర్ శాస్త్రవేత్త కె.నాగరాజు కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు దెందులూరు విద్యార్థి



రత్నభూషణం

దెందులూరు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు దెందులూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థి కర్నాటక రత్నభూషణం ఎంపికయ్యాడని హెచ్‌ఎం విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో జరిగిన రెజ్లింగ్ పోటీల్లో 35 కేజీల విభాగంలో పాల్గొని అత్యంత ప్రతిభ కనబరచి ఎంపికవడంపై పలువురు ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

దొంగ సొత్తు జీవితాలు చిత్తు



ఏలూరు జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు (ఫైల్)

(భీమవరం క్రైం-ఆంధ్రజ్యోతి)

- భీమవరానికి చెందిన ఓ నగల వ్యాపారి తనకు తెలిసిన ఖాతాదారుడి వద్ద 40 గ్రాముల పాత బంగారు వస్తువులను కొనుగోలు చేసి నాలుగు లక్షలు సొమ్ములు ఇచ్చేశాడు. వీటిని విక్రయించిన వ్యక్తిని తీసుకుని నెల రోజుల తర్వాత పోలీసులు వ్యాపారి వద్దకు వచ్చి.. మీరు 'కొన్నది దొంగ సొత్తు' అని చెప్పి రికవరీ చేశారు. దీంతో వ్యాపారికి నాలుగు లక్షలు నష్టం.
- ఉండికి చెందిన ఒకరు తనకు తెలిసిన వ్యక్తి వద్ద రూ. 50 వేలకు బైక్ కొనుగోలు చేశాడు. దీనికి సంబంధించిన పత్రాలను తర్వాత ఇస్తానని చెప్పడంతో నమ్మాడు. కొద్ది రోజుల తర్వాత పోలీసులు అతనికి ఫోన్ చేసి 'మీరు కొన్నది దొంగ బైక్' అని చెప్పడంతో ఇతన షాక్ తిన్నాడు. ఆ బైక్‌ను స్టేషన్‌లో అప్పగించి ఊపిరి పీల్చుకున్నాడు.
- భీమవరానికి చెందిన ఓ వ్యాపారి ఊరు వెళ్లేందుకు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. అతని లక్షన్నర విలువైన సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించాడు. ఈ దొంగ ఈ ఫోన్‌ను వేరే వ్యక్తికి సగం ధరకే విక్రయించాడు. కొనుగోలు చేసిన వ్యక్తి ఫోన్‌లో సిమ్ వేయగానే జిల్లా స్పెషల్ టీమ్ ఆ వ్యక్తికి ఫోన్ చేసి 'ఈ ఫోన్ మీకెక్కడిది..? ఇది దొంగతనానికి గురైన ఫోన్.. తక్షణం పోలీసు కార్యాలయంలో అప్పగించాలని చెప్పడంతో కొనుగోలు చేసిన వ్యక్తి ఖంగుతిన్నాడు.
- ఆకివీడుకు చెందిన ఒక మహిళ తన ఇంటి సమీపంలో వున్న మరో మహిళకు తన భర్త తక్కువ ధరకు బంగారం కొన్నాడని చెప్పింది. కావాలంటే మీకు ఇస్తానని చెప్పడంతో ఆశపడిన ఆమె నాలుగు లక్షలు చెల్లించి కొనుగోలు చేసింది. కొన్ని రోజులకు పోలీసులు వచ్చి.. అది దొంగ బంగారం మీరు ఎలా కొన్నారంటూ ప్రశ్నించి స్వాధీనం చేసుకున్నారు. ఇలా ఒకటి, రెండు కాదు.. పెద్ద సంఖ్యలో దొంగ వస్తువులను కొని ప్రజలు నష్టపోతున్నారు.



పెరిగిన దొంగతనాలు

- తక్కువ ధరకే దొంగ సొత్తు.. బైక్‌లు, బంగారం, సెల్‌ఫోన్ల విక్రయాలు
- కొని చిక్కుల్లో పడుతున్న ప్రజలు..
- సెకండ్ హ్యాండ్ వస్తువులపై జాగ్రత్త వహించాలని పోలీసుల హెచ్చరిక



బంగారం, వెండి ధరలు ఇటీవల భారీగా పెరగ డంతో అదే స్థాయిలో దొంగతనాలు పెరిగాయి. తాళం వేసిన ఇళ్లు, రోడ్లపై వెళుతున్న మహిళలు, వృద్ధులను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నారు. దొంగిలించిన వస్తువులు దుకాణాల్లో కొనుగోలు చేయకపోవడంతో అమాయకులకు ఎర వేస్తున్నారు. తక్కువ ధరకు బంగారం, వెండి విక్రయిస్తామని, తాము ఆస్తులు కొన్నామని, అర్జెంటుగా నగదు అవసరమని, మాయ మాటలు చెప్పి విక్రయిస్తున్నారు. కొంత కాలానికి దొంగ పోలీసులకు పట్టుబడి దొంగిలించిన వస్తువులు ఎక్కడ విక్రయించాడో చెబుతున్నాడు. దీంతో ఇతని వద్ద వస్తువులు కొనుగోలు చేసిన వారు పోలీసులకు పట్టుపడుతున్నారు. అటు దొంగకు ఇచ్చిన సొమ్ములు పోయి, కొనుగోలు చేసిన వస్తువులు పోలీసులకు అప్పగించి తీవ్రంగా నష్టపోతున్నారు. చోరీ సొత్తుకు ఆశపడి కొందరు బంగారు దుకాణదారులు కొనుగోలు చేసి చిక్కుల్లో పడుతున్నారు.

నమ్మి మోసపోవద్దు



తక్కువ ధరకు బంగారం, వెండి, వాహనాలు, సెల్‌ఫోన్లు వస్తున్నాయని సెకండ్ హ్యాండ్ వస్తువులు కొని ఎవరూ మోసపోవద్దు. తక్కువ ధరకు వస్తున్నాయంటేనే అవి దొంగ సొత్తు కాని, ఊరికే వచ్చినవి కాని అయ్యి వుంటాయని అర్థం చేసుకోవాలి. ఇటీవల దొంగతనాలు పెరిగాయి కాబట్టి సెకండ్ హ్యాండ్ వస్తువుల పట్ల జాగ్రత్తగా ఉండాలి. అవతలి వారిపై అనుమానం ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

\- ఆర్‌జీ జయసూర్య, డీఎస్పీ, భీమవరం

వాటిని కొనుగోలు చేయద్దు

తక్కువ ధరకు వస్తుందని, నాణ్యతగా ఉందని ఆశ పడి తెలియని, తెలిసిన వ్యక్తుల నుంచి ద్విచక్ర వాహనాలు, సెల్‌ఫోన్లు, బంగారం, వెండి, ఫర్నీచర్, గృహోపకరణాలు వంటి సెకండ్ హ్యాండ్ వస్తువులు కొనుగోలు చేయవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. సెల్‌ఫోన్ల దొంగతనాలపై పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల ఎస్పీలు అద్నాన్ నయీం అస్మి, కేపీఎస్ కిశోర్ ప్రత్యేక దృష్టి పెట్టారు. స్పెషల్ టీమ్‌లను ఏర్పాటుచేసి పోయిన, దొంగిలించబడిన సెల్‌ఫోన్లపై ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ విధంగా ఈ రెండు జిల్లాల్లో వేలాది ఫోన్‌లను రికవరీ చేసి బాధితులకు అప్పగించారు. అలాగే బంగారు వస్తువులు, బైక్‌లను కూడా స్వాధీనం చేసుకుని వాటిని కూడా అప్పగించారు.

డీఏ బకాయిలపై క్యాబినెట్‌లో ఏదీ చర్చ

ఏలూరు రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఉద్యోగులకు పెండింగ్ డీఏలు, పీఆర్సీ బకాయిలపై క్యాబినెట్ సమావేశంలో చర్చించకపోవడం శోచనీయమని, దీపావళి కానుకగా డీఏ ప్రకటిస్తారని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురైందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం, రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలు కనీసం చర్చించకపోవడంపై ఉద్యోగులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 16 నెలలు అయినా ఇప్పటికే అనేకసార్లు క్యాబినెట్ సమావేశాలు జరిగినా ఉద్యోగులకు రావలిసిన బకాయిలు, పెండింగ్ డీఏలు, పీఆర్సీపై నిర్ణయం తీసుకోకపోవడంతో ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఉద్యోగుల సమస్యలపై కొన్ని సంఘాలు ఇప్పటికే ఆందోళన బాట పడుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులను దూరం చేసుకోకుండా సమస్యలపై చర్చించి న్యాయం చేయాలని రవీంద్రరాజు విజ్ఞప్తి చేశారు.

రామాలయం విగ్రహాల దొంగలు అరెస్ట్

చింతలపూడి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): రేచర్ల పంచాయతీలోని రామాలయంలో అపహరించిన విగ్రహాల కేసును పోలీసులు ఛేదించారు. అపహరించిన లభ్యమయ్యాయని, ముగ్గురు దొంగలను అరెస్ట్ చేశామని చింతలపూడి ఎస్ఐ సతీష్‌కుమార్ తెలిపారు. రామాలయంలో విగ్రహాలు తొలగించి ఆ స్థానంలో గుంత తవ్వి మట్టి పోశారంటూ రేచర్లలో గ్రామస్థులు గురువారం ఆందోళన చేపట్టారు. రేచర్ల తండా రామాలయంలో విగ్రహాలు తన సొంత స్థలం రామాలయంలో ఉన్నాయని, గుడిలో ఉన్న విగ్రహాలు తొలగించి వాటిని అక్కడి నుంచి మాయం చేసిన అదే గ్రామానికి చెందిన దారావత్ బాలు, దారావత్ మంగమ్మ, కృష్ణమూర్తి అపహరించారని దారావత్ దీప్తి ఫిర్యాదు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆ విగ్రహాలు నాగిరెడ్డిగూడెం ప్రాజెక్టు సమీపంలో స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. ఈ కేసుపై దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

క్రైం సమాచారం

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

ఏలూరు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఏ కారణమో తెలియదు కాని ఆటో డ్రైవర్ తన ఇంట్లోని బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు శనివారపుపేటకు చెందిన యర్రా వెంకటేశ్వరరావు(48)కు భార్య సూర్యప్రభావతి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె భీమవరంలో బీటెక్, కుమారుడు పాలిటెక్నిక్ చదువుతున్నారు. పిల్లల చదువుల నిమిత్తం దంపతులిద్దరూ భీమవరంలో ఉంటున్నారు. ఆటో డ్రైవర్లకు రూ.15 వేలు ఆర్థిక సాయం పొందేందుకు ఈ నెల 5న ఏలూరు వచ్చారు. 8న అతడి భార్య, పిల్లలు వెళ్లిపోయారు. అప్పటి నుంచి అతడి ఇంట్లో ఒంటరిగానే ఉంటున్నాడు. కారణం తెలియదు.. శుక్రవారం ఉదయం బాత్‌రూమ్‌లో ఉరి వేసుకుని ఉండడాన్ని పక్కింటి వారు బంధువులకు సమాచారం ఇచ్చారు. త్రీటౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఇంటికి చేరుకుని పరిశీలించి, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):మద్యం మత్తులో ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దెందులూరు మండలం రామారావుగూడెంకు చెందిన చట్టుమాల డేవిడ్‌రాజు (50)కు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 9వ తేదీ రాత్రి అతిగా మద్యం తాగి పురుగుల మందు కూడా తాగేశాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. ఈ ఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):అస్సాం రాష్ట్రంలోని గౌహతికి చెందిన ఒక ప్రయాణికుడు త్రిపుర వెళ్తూ మార్గమధ్యలో దెందులూరు మండలం అలుగులగూడెం సమీపంలో రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు సమాచారం అందడంతో రైల్వే ఎస్ఐ శివన్నారాయణ ఆధ్వర్యంలో హెచ్‌సీ పి.శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద ఆధారాల బట్టి బంధువులకు సమాచారం ఇచ్చారు.

బంగారం చోరీపై కేసు నమోదు

టి.నరసాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బంగారం చోరీపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎం.జయబాబు తెలిపారు. తెడ్లం పంచాయతీలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన పంతగాని నాగరాజు తాపీపని చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 7న ఉదయం తన కుమారుడిని పాలకొల్లులోని హాస్టల్‌కు తీసుకెళ్లి అదేరోజు సాయంత్రం గ్రామానికి వచ్చి ఇంటికి వెళ్లకుండా అదే గ్రామంలో ఉంటున్న తల్లి ఇంటికి వెళ్లి మరుసటి రోజు పనికి వెళ్లిపోయాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటితాళాలు పగలకొట్టి బీరువాలో ఉన్న ముప్పావుకాసు జోడు, పావుకాసు ఉంగరం, కొంత నగదు, అపహరించి నట్లు గుర్తించారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ఐపీ పెట్టిన చేపల వ్యాపారి

ఆకివీడు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):చేపల కొనుగోలు, అమ్మకాలు జరిపే వ్యాపారి రూ.30 లక్షలకు ఐపీ పెట్టాడు. స్థానిక లాంచీలరేవులోని చేపల మార్కెట్‌లో సుమారు ఎనిమిదేళ్ల నుంచి సమతానగర్‌కు చెందిన అనిల్ వర్తకుల దగ్గర చేపలు కొనుగోలు చేసి బెంగళూర్, కేరళ, కర్ణాటక లోడింగ్ చేస్తుంటాడు. పది మంది వర్తకులకు రూ.29.60 లక్షలు బకాయి పడ్డాడు. మూడు నెలల నుంచి కనబడుట లేదు. ఈ క్రమంలో అనిల్ అమ్మను వర్తకులు నిలదీయగా తనకు సంబంధం లేదని ఆమె తెలిపింది. శుక్రవారం పది మంది వర్తకులకు ఏలూరు జిల్లా కోర్టు నుంచి అతడు ఐపీ పెట్టినట్టు నోటీసులు వచ్చాయి. నవంబరు 5న కోర్టుకు హాజరుకావాలని పేర్కొన్నారు. దీంతో చేపల వర్తకులు లబోదిబోమంటున్నారు.



తణుకులో వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ విశ్వనాథ్

ఒంటరి మహిళను బెదిరించి.. బంగారం దోచుకున్న పది మంది అరెస్టు

- రూ.16 లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్న పోలీసులు

తణుకు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):తణుకు వారణాసి వారి వీధిలో నివాసం ఉంటున్న ఒంటరి మహిళను చంపుతామని బెదిరించి బంగారు ఆభరణాలు అపహరించిన కేసులో పది మందిని శుక్రవారం పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తణుకు పట్టణ పోలీసు స్టేషన్‌లో తాడేపల్లిగూడెం డీఎస్పీ విశ్వనాథ్ వివరాలను వెల్లడించారు. గత నెల 26వ తేదీన ఒంటరిగా నివాసం ఉంటున్న వాకలపూడి కనకదుర్గను అర్ధరాత్రి సమయంలో ముఖానికి మాస్కులు ధరించి ఇంటిలోకి ప్రవేశించి ఆమె చేతులను వెనక్కికట్టి, అరిస్తే చంపుతామని బెదిరించి ఒంటి మీద ఉన్న బంగారు ఆభరణాలు, బీరువాలో వున్న ఆభరణాలు సుమారు 70 కాసులతోపాటు రూ.70 వేల నగదును తస్కరించారు. అప్పట్లో పట్టణంలో తీవ్ర సంచలంగా మారిన కేసును సీఐ కొండయ్య ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారు. ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నేరానికి పాల్పడిన పది మంది, మరి కొంతమందితో కలిసి ప్రణాళిక ప్రకారం దోపిడీకి పాల్పడి బంగారం, నగదు దొంగిలించి అందరూ పంచుకున్నట్టు చెప్పారు.

ఈ కేసులో మహారాష్ట్రకు చెందిన సందీప్ రామశంకర్ ఉపాధ్యాయ, మహమ్మద్ ఇక్బాల్ షేక్, రాజమహేంద్రవరానికి చెందిన మీసాల శ్రీనివాసరావు, నిమ్మకాయల శ్రీకాంత్, దుర్గాపు సత్యనారాయణ, దివ్వెల యేసు, బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన గొర్రెపూడి వెంకటరమణ, శ్రీకాకుళం చిన్న, కర్రి సాయి, చంద్రారెడ్డిలను శుక్రవారం అరెస్టు చేశారు. వారి నుంచి పది బంగారు గాజులు, చెవి దిద్దులు జత, మాటీలు జత కలిసి 162.25 గ్రాముల బంగారు వస్తువులైన రూ.16లక్షలు విలువైన ఆభరణాలు, వినియోగించిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐలు కె.కొండయ్య, బి.కృష్ణకుమార్, బి.బి.రవికుమార్, ఎస్ఐలు కె.శ్రీనివాసు, కె.ప్రసాదు, డి.ఆదినారాయణ, కె.చంద్రశేఖర్. పి.ప్రేమ్‌రాజ్ సిబ్బంది ఎస్.శ్రీధర్, పి.సంగీతరావు, పి.సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

తమిళనాడుకు జార్ఖండ్ బాలల అక్రమ రవాణా

ఆరుగురు దళారులపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బాలలను అక్రమంగా తమిళనాడులోని బనియన్ల ఫ్యాక్టరీలో కార్మికులుగా చేర్పించడానికి తీసుకువెళ్తున్న ఆరుగురు దళారులను గుర్తించి వారిపై ఏలూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. వారి నుంచి 14 మంది బాలలను సంరక్షించారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పేదరికంలో ఉన్న బాలలు 12 నుంచి 14 ఏళ్లలోపు వారు మొత్తం 14 మందిని తమిళనాడులోని ఒక బనియన్ల ఫ్యాక్టరీలో పనుల్లో పెట్టడానికి తీసుకువెళ్తున్నారు.

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రూప్‌లాల్ మిరడా, కార్తన్ గంగరాయ్, ముఖేష్‌కోరా, మహావీర్ ముర్మ్, మనోరూష్ హజ్రా, డిస్కోదాస్‌లు ఆప్రాంతానికి చెందిన పేదరికంలో ఉన్న 14 మంది బాలలను తమిళనాడుకు రైలులో తీసుకువెళ్తున్నారు. ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. బాలలు ఉండడంతో అనుమానం కల్గి వారిని ప్రశ్నించారు. ఈమేరకు బాలలను సంరక్షించి దళారులైన ఆరుగురిపై జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి వారిని అదుపులోకి తీసుకున్నారు. బాలలను జిల్లా బాలల సంరక్షణ అధికారులకు అప్పగించడంతో వారిని ఏలూరులోని శనివారపుపేటలో ఉన్న బాలల సంరక్షణ హోమ్‌నకు తరలించారు.

16, 17న హార్టీకల్చర్ మాన్యువల్ కౌన్సెలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 16, 17 తేదీల్లో మూడో విడత మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్టు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 16న 1,346 ర్యాంకు నుంచి 21,942 ర్యాంకు వరకు, 17న 21,943 నుంచి 60,497 ర్యాంకు మధ్య వారికి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు వివరించారు. అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో స్వయంగా హాజరుకావాలని సూచించారు. ఏ కళాశాలలో సీట్లు పొందారో ఆ కళాశాలలో వెంటనే చేరాల్సి ఉంటుందన్నారు.



రోడ్డుపై గోతుల్లో నాటిన మొక్క

రోడ్డుపై గోతుల్లో మొక్కలు నాటి నిరసన

టి.నరసాపురం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలరాజుగూడెం ప్రధాన సెంటర్‌లో రోడ్డు అధ్వానంగా మారింది. వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గోతుల్లో కొబ్బరి, అరటిమొక్కలు నాటి నిరసన తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ మండలంలో ప్రధాన రహదారులన్ని నరక కూపాలుగా మారాయన్నారు. అప్పలరాజుగూడెం ప్రధాన కూడలిలో ఉన్న గోతులు ప్రమాదకరంగా ఉన్నాయని వాహనదారులు, స్థానికులు ప్రమాదాల్లో గాయపడుతున్నారన్నారు. ప్రభుత్వం కనీసం పూడ్చి ప్రమాదాలు నివారించాలని కోరారు. ఉన్నతాధికారులు స్పందించాలని రోడ్లు అభివృద్ధి చేసి సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా 27, 28, 29 తేదీల్లో టి.నరసాపురంలో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి బొడ్డపాటి రాజు, మండల నాయకులు రాజీవ్, గాంధీ, బొద్దుల గంగాభవాని, చెల్లమ్మ, రామలక్ష్మి, మడకం కుమారి, తదితరులు పాల్గొన్నారు.



తంగెళ్లమూడి క్యాంపులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

విభిన్న ప్రతిభావంతులకు మెరుగైన వైద్యసేవలందించాలి : రత్నప్రసాద్

ఏలూరు క్రైం/పెదవేగి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):విభిన్న ప్రతిభావంతులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా ఏలూరు-తంగెళ్లమూడిలో ఉన్న మిషన్ ఆఫ్ చారిటీ విభిన్న ప్రతిభావంతుల గృహంలో, పెదవేగి మండలం వంగూరులోని జేఅండ్‌జే కరుణోదయ విభిన్నప్రతిభావంతుల ప్రత్యేక పాఠశాలలో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా తంగెళ్లమూడిలో ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి వ్యక్తికి న్యాయసేవలు అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తంగెళ్లమూడిలో డీఎంహెచ్‌వో పీజే అమృతం, సీడబ్ల్యూసీ ఇన్‌చార్జి ఛైర్మన్ పి.వెంకటేశ్వరరావు, ప్యానల్ న్యాయవాది బి.సంగీతరావు, వంగూరులో జేఅండ్‌జే కరుణోదయ, పాఠశాల మేనేజర్ డూమ్నిక్ తదితరులు పాల్గొన్నారు.

సరిపల్లి పద్మశ్రీ కాలనీలో ఉద్రిక్తత

నరసాపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):సరిపల్లి పంచాయతీ పరిధిలోని పద్మశ్రీకాలనీలో శుక్రవారం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఓ ప్రార్థన మందిరం నుంచి అధికమైన మైక్ సౌండ్‌లు రావడాన్ని స్థానికులు అభ్యంతరం తెలిపారు. సమీపంలో స్కూల్, కాలనీ ప్రజలు ఉన్నందున తక్కువ సౌండ్‌తో ప్రార్థనలు చేసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రార్థన నిర్వాహకులకు, స్థానికులకు వాగ్వాదం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్ సభ్యులు అక్కడికి చేరుకుని ఆందోళనకు దిగారు. సమాచరం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ వెంకటసురేష్ అక్కడికి వెళ్లి ఇరువురితో చర్చలు జరిపారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్కువ సౌండ్ పెట్టుకోవాలని సూచించారు. భవనాలపై ఏర్పాటు చేసిన మైక్‌లను తొలగించారు.

ఫ్లెక్సీల ధ్వంసంపై ఫిర్యాదు



వాడపల్లి పీఏసీఎస్ వద్ద చించివేసిన ఫ్లెక్సీలు

ముదినేపల్లి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడపల్లిలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవన ప్రారంభోత్సవం సందర్భంగా సంఘ పాలక వర్గం ఏర్పాటు చేసిన ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే కామినేని తదితరులతో కూడిన 12 ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించి వేశారు. కొన్ని ఫ్లెక్సీలను చించి వేయగా, మరి కొన్ని ఫ్లెక్సీల్లో నాయకులు ఫొటోలపై సిగరెట్లతో కాల్చారు. గత నెల 28న భవనం ప్రారంభోత్సవం సందర్భంగా కొత్తపల్లి నుంచి వాడవల్లి వరకు ఏర్పాటు చేసిన ఈ ఫ్లెక్సీలను మూడు రోజుల క్రితం దుండగులు ధ్వంసం చేశారని, ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వాడవల్లి పీఏసీఎస్ ఛైర్మన్ ముమ్మడిశెట్టి గోవర్ధనరావు, సీఈవో కఠారి నాగమునీంద్రరావు శుక్రవారం ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తుచేస్తున్నారు.

ఆక్వా చెరువులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

నరసాపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు తమ చెరువుల్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మత్స్యశాఖ అధికారి భారతి తెలిపారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు ప్రభుత్వం అందించే విద్యుత్ రాయితీ యూనిట్‌కు రూ.1.50 లభిస్తుందన్నారు. సీఏఏ రిజిస్ట్రేషన్ చేయించుకునే రైతులు పట్టాదారు పుస్తకం, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, వీఆర్వో అటెస్టేషన్, యూనిట్ విలువ తదితర వివరాలను తీసుకుని మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలి

ఉండి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):వీఆర్‌ఏల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లా సుబ్బారావు, సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఎం.ఆంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సంఘ సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు పిల్లి సుబ్బారావు, ఆంజనేయులు మాట్లాడుతూ ఈనెల 11, 16వ తేదీలలో విజయవాడలో నిరసన కార్యక్రమం జరుగుతుందన్నారు. వీఆర్‌ఏలంతా విధిగా హాజరుకావాలన్నారు. విఆర్‌ఏలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మహిళల చేతిలో వజ్రాయుధం శక్తి యాప్

భీమవరం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):మహిళల సంరక్షణకు శక్తి యాప్ వజ్రాయుధంలాంటిదని ఏఎస్ఆర్ నగర్ సచివాలయం మహిళా సంరక్షణ కార్యదర్శి షెహనాజ్ సయ్యద్ అన్నారు. స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్‌పై అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ముఖ్యంగా కౌమార దశలోని ఆడపిల్లలు సమాజ పోకడల పట్ల జగరూకతతో వ్యవహరించాలని సూచించారు. లైంగిక వేధింపులు, గృహహింస, అణచివేతల నుంచి ఈ యాప్ రక్షణ కల్పిస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీకేజే ప్రసూన, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ జి.ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

బోధనేతర పనులు వద్దంటూ వినతి


కాళ్లలో ఎంఈవో శ్రీనివాసరావుకు వినతి పత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

కాళ్ల, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల బోధన సమయం హరించుకుపోతున్నదని, ఉపాధ్యాయులకు కూడా బోధనపై ఆసక్తి తగ్గిపోయే విధంగా బోధనేతర కార్యక్రమాలు పెరిగిపోయాయని ఫ్యాప్టో నాయకులు సీహెచ్.పట్టాభిరామయ్య తెలిపారు. అక్టోబర్ 10వ తేదీ నుంచి బోధనేతర కార్యక్రమాలను బహిష్కరించాలని రాష్ట్ర ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం కాళ్ల ఎంఈవో డి.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు.

ఆకివీడు: మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వలన బోధనా సమయం హరించుకుపోతుందని ఫ్యాప్టో సంఘం నేతలు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఎంఈవో రవీంద్రకు వినతిపత్రం అందచేశారు. బోధనలో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు.

బాణసంచా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకోవాలి


బాణసంచా వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): బాణసంచా వ్యాపారు లు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆర్డీవో ఖతీఫ్ కౌసర్‌భనో సూచించారు. తాడేపల్లిగూడెం ఆర్డీవో కార్యాలయం వద్ద బాణ సంచా వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపా రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవి ంచకుండా చర్యలు తీసుకోవాలని, పిల్లలు బాణసంచా దుకాణాల వద్ద ఉండకూడదని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం సునీల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాలబొమ్మల

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షునిగా బాలబొమ్మల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. భీమవరంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా సమావేశంలో ఏపీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడి శీలం ప్రకటించినట్టు బాలబొమ్మల తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాన్ని నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మార్నిడి బాబ్జి అందించారు.

మొబైల్ వినియోగం వల్ల మానసిక సమస్యలు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):మొబైల్, ఇంటర్నెట్ వినియోగం వల్ల మానసిక ఆందోళన పెరుగుతుందని ప్రముఖ న్యూరో వైద్యులు కె.పృథ్వీరాజ్ తెలిపారు. తాడేపల్లిగూడెంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం వద్ద ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా మానసిక సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ పి.అశోక్, లయన్స్‌క్లబ్ చైర్మన్ పేరిచర్ల మురళికృష్ణంరాజు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నరేశ్

ఆకివీడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని టీడీపీ మండలాధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, ఏఎంసీ చైర్మన్ బొల్లా వెంకట్రావు అన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడిగా ఎన్నికైన మద్దా నరేశ్‌ను శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయం సన్మానించారు. కార్యక్రమంలో మండల, పట్టణ ప్రధాన కార్యదర్శులు నౌకట్ల రామారావు, గంధం ఉమా, కౌన్సిలర్ బొల్లా వీరశ్వేత, శేషుబాబు, ఇల్లాపు శేషవేణి పాల్గొన్నారు.

ఆడపిల్లలు చదువుకోవాలి

వీరవాసరం(భీమవరం టౌన్)అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అమ్మాయిలకు ముందుగా చదువు ఉండాలి, సమాజంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి, అమ్మాయిల ఆరోగ్యం గురించి శ్రద్ధ వహించాలని కాపు వనిత క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్. లక్ష్మీ కళ్యాణి తెలిపారు. వీరవాసరం కాపు వనిత క్లబ్, కాపు సర్వీస్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం రాయకుదురులోని జూనియర్ కాలేజ్‌లో ఇంటర్నేషనల్ డే ఆఫ్ గర్ల్స్‌చైల్డ్ సందర్భంగా అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. వనిత క్లబ్ సెక్రటరీ కామిశెట్టి విజయలక్ష్మీ మాట్లాడుతూ ద్రౌపతి ముర్ము, నిర్మల సీతా రామన్, పీవీ సింధు, సావిత్రిబాయి పూలే వంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలి అన్నారు.

పెరుగుతున్న మానసిక రోగులు

భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నేటి పోటీ ప్రపంచంలో చాలా మంది ఒత్తిడిని తట్టుకోలేక పోతున్నారని, మానసిక వ్యాధులతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోందని ప్రముఖ మానసిక వైద్యులు డా జీవి రమణరావు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం శాంతి హాస్పటల్లో ప్రపంచ మానసిక దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ రమ ణరావు మాట్లాడుతూ విద్యార్థులపై అనేక రకాలుగా ఒత్తిడి చేస్తున్నారని, తల్లిదండ్రులు ఆలోచనల్లో మార్పురావాలని సూచించారు. మానసిర రోగులను ముందుగా గుర్తించకపోవడం వల్ల ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి ఉందన్నారు. డాక్టర్ జి సుభాష్, డాక్టర్ శ్రీవిద్య, కార్యక్రమ కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ అవగాహన రాహిత్యంతో మానసిక రోగులు వైద్య సలహాలను పొందటం లేదన్నారు. సమస్యలపై పట్ల కృంగిపోకూడదన్నారు.

ఆర్థిక సాయం

యలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): బూరుగుపల్లి గ్రామం కొత్తకాలనీకి చెందిన ముత్యాలపల్లి పెద్దిరాజుకు కొంతకాలం క్రితం పక్షవాతం రావడంతో ఇంటికే పరిమితమయ్యాడు. పేదకుటుంబం కావడంతో మందులు కొనుగోలుచేయడానికి సైతం పెద్దిరాజు ఇబ్బందులు పడుతున్నాడన్న విషయం తెలుసుకున్న జైభీమ్ యువసేన ఫౌండేషన్ సభ్యులు వెంటనే స్పందించి పెద్దిరాజు ఇంటికి వెళ్లి రూ.11వేల నగదును అందజేశారు.

పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహం

భీమవరం క్రైం, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): భీమవరం నుంచి కాళీపట్నం వెళ్ళే పంట కాలువలో యనమదుర్రు మురుగు కాలువ నుంచి దెయ్యాలతిప్ప వైపు వెళ్ళే వంపు దగ్గర కాలువలో గుర్తు తెలియని సుమారు 40 సంవత్సరాల వయస్సు గల మగ వ్యక్తి మృతదేహం స్థానికులు గుర్తించారు. దీంతో పోలీసులకు సమాచారం అందించడంతో నీలం రంగు చొక్కా ఫుల్ హ్యాండ్స్, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. దీనిపై భీమవరం రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఈ వ్యక్తికి సంబంధించిన వారుంటే 94407 96646 నంబర్‌కు సంప్రదించాలని ఎస్‌ఐ వీర్రాజు కోరారు.

బాలికను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

యలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఒక మైనర్ బాలికను వెంటబడి వేధిస్తున్న పెదలంక గ్రామానికి చెందిన కొల్లు నానిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కె.గుర్రయ్య తెలిపారు. మైనర్ బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.





తాడేపల్లిగూడెంలోని ఒక షోరూమ్‌లో జీఎస్టీ పట్టికను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి..నరసాపురంలో ఎమ్మెల్యే నాయకర్.. పెనుమంట్ర మండలంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని.. పెంటపాడులో విద్యార్థుల మానవహారం

పేద, మధ్యతరగతి కుటుంబాలకు భరోసా

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీలు, సదస్సులు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):జీఎస్టీ సంస్కరణలు పేద, మధ్య తరగతి కుటుంబాలకు భరోసాగా నిలిచిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆర్టీసీ డిపో, బాజాజ్ ఎలక్ట్రానిక్ షోరూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పేద, మధ్యతరగతి వారికి నెలకు రెండు వేల నుంచి మూడు వేల వరకు ఆదా అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కమర్షియల్ ట్యాక్స్ అధికారితో పాటు జనసేన నాయకులు అడపా ప్రసాద్, మైలవరపు రాజేంద్రప్రసాద్, కాళ్ల గోపి, గుండుమోగుల సురేష్, మణికుమార్ పాల్గొన్నారు.

భీమవరం టౌన్: జీఎస్టీ తగ్గింపుపై ప్రతి వ్యక్తికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో సోనో విజన్, స్టార్ విజన్, రిలయన్స్ డిజిటల్, మైనాట్ ఎలక్ట్రికల్, ఇన్నోవేషన్ షాపింగ్ తదితర కంపెనీలు ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ప్రదర్శనను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రారంభించి, జీఎస్టీ రేట్ల తగ్గింపును పరిశీలించారు.

నరసాపురం టౌన్: జీఎస్టీ తగ్గడంతో అన్ని వస్తువుల ధరలు తగ్గి ప్రజల ఆదాయం పెరగనుందని విప్ నాయకర్ అన్నారు. శుక్రవారం స్టీమర్‌రోడ్‌లోని దివ్య ఎలక్ట్రానిక్ దుకాణాలోకి వెళ్లి రేట్లు తగ్గిన వస్తువుల వివరాలు ఆరా తీశారు. వాటిని అక్కడున్న కష్టమర్లకు చెప్పి, రానున్న రోజుల్లో అన్ని వస్తువులు ధరలు ఇంకా తగ్గుతాయన్నారు. కొత్త పన్నుల విధానం వల్ల వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ అంజయ్య, ఎంపీడీవో వీరభద్రరావు, కోటిపల్లి వెంకటేశ్వరావు, కోటిపల్లి సురేష్, బొమ్మిడి కృష్ణమూర్తి, వలవల నాని, నళిని పాల్గొన్నారు.

ఆచంట: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు ఊరట లభించిందని పాలకొల్లు వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ ఉషా సత్యదేవి అన్నారు. శుక్రవారం సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ఆచంటలోని ఎలక్ట్రికల్ షాపులో ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గిపుంతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో బి. కృష్ణమోహన్, పంచాయతీ కార్యదర్శి నాగబాబు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా రామకృష్ణ, దివ్య రాంబాబు పాల్గొన్నారు.

గణపవరం:కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణలతో పలు వస్తువులు తక్కువ ధరలకే అందుబాటులోకి వచ్చాయని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి అన్నారు. శుక్రవారం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి జీఎస్టీపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వ్యాపారులు జీఎస్టీ తగ్గింపు ధరల ప్రకారమే వస్తువులు విక్రయించాలని కోరారు.

పెంటపాడు: జీఎస్టీ తగ్గింపుపై శుక్రవారం పెంటపాడు డీఆర్ గోయింకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ర్యాలీ చేసి కాలేజ్‌సెంటర్ వద్ద మానవహారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు టీఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

వీరవాసరం (భీమవరం టౌన్): వీరవాసరంలోని ఎంఆర్‌కే జిల్లా పరిషత్ హైస్కూల్లో శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ రామాంజనేయులు, ఎంపీడీవో అప్పారావు, కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. అనంతరం ర్యాలీ నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.

తణుకు:దేశంలోని మొదటిసారిగా జీఎస్టీ అమలు చేసిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారంతణుకు చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వాసవి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జీఎస్టీ అమలుతో పేద, మధ్యతరగతి వర్గాలకు కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. ప్రతి కుటుంబానకి రూ. 15వేలు ఆదా అవుతుందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆరిమిల్లిని చాంబర్ ప్రతినిధులు సత్కరించారు.

పెనుమంట్ర: నెలమూరు, ఓడూరు గ్రామాల్లో శుక్రవారం పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పితాని మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలకు, గృహోపకరణాలకు, నిత్యావసర వస్తువులకు జీఎస్టీ తగ్గించడం జరిగిందని అన్నారు.

పాలకొల్లు టౌన్:జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని వాణిజ్య పన్నులశాఖ సహాయ కమిషనర్ డి.సాంబశివరావు అన్నారు. పాలకొల్లు పట్టణంలోని పలు ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాల షాపుల వద్ద వాణిజ్య పన్నులశాఖ సహాయ కమిషనర్ డి.సాంబశివరావు, వివిధశాఖల అధికారులతో కలిసి సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, డిప్యూటీ ఎంపీడివో టి.మూర్తిబాబు పాల్గొన్నారు.

కామాక్షి ఆలయంలో అన్నసమారాధన


అన్న సమారాధనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యేఅంజిబాబు

భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓవర్ బ్రిడ్జి దగ్గర కామాక్షి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం ఏర్పాటు చేసిన అన్న సమారాధనను ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) ప్రారంభించారు. శరన్నవరాత్రులు ముగింపు సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న సమారాధనను నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు మహా నివేదనకు హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ యువజన సంఘం సభ్యులు పుట్ట నాగ ఫణి కుమార్, మందరపు వసంత్, ఆవుపాటి జగన్, అనుపోజు మురళీకృష్ణ, తమిళ్ సుబ్రహ్మణ్యం, విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు శ్రీశైలపు నాగబాబు, భక్తులు పాల్గొన్నారు.

పాలకోడేరు: పాలకోడేరు కొత్తపేటలో విజయ కనకదుర్గ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం దసరా వేడుకలు ముగింపు సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు నిట్టా ధర్మేంద్ర ఫణిశర్మ మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా దసరా వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మొగల్తూరు:శరన్నవరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా మొగల్తూరు కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం అన్న సమారాధన నిర్వహించారు. సర్పంచ్ పడవల మేరీ, ఉప సర్పంచ్ బోణం నర్సింహారావు, ముక్కు పుల్లయ్య నాయుడు, ఓం వెంకట నాగేశ్వరరావు, దూసనపూడి రాజు, గుత్తుల బాబి, గునిశెట్టి నర్సింహమూర్తి, లక్కు బాలాజీ తదితరులు సేవలందించారు.

రైతులకు దీర్ఘకాలిక రుణాలు అందజేత

నరసాపురం రూరల్, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో రుణాలందించేందుకు సిద్ధంగా ఉన్నామని లక్ష్మణేశ్వరం సొసైటీ చైర్మన్ చాగంటి పార్థసారధి అన్నారు. శుక్రవారం సొసైటీలో డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి చిన్నతో కలిసి రూ.45లక్షల దీర్ఘకాలిక రుణాలను రైతులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను కూడా అందిస్తామన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ముదునూరి సత్యనారాయణరాజు, దొంగ రామలక్ష్మి, జి.వెంకటేశ్వరావు, దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు చేయించుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

తణుకు, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు అవ సరమని ఎమ్మెల్యే ఆరి మిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం వికె కన్వెన్షన్ హాల్‌లో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రి జిఎస్ఎల్ క్యాన్సర్ ఆసుపత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. ఇందులో 12మందిని అనుమానితులుగా గుర్తించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట కృష్ణ, మల్లిన అరుణ సారథి, జి.సుధాకర్, కె.సిద్ధార్థ, పోతుల శ్రీనివాసు, కాశీ విశ్వనాథం పాల్గొన్నారు.

గణపవరం:గణపవరం లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం పీఎంపీల అసోసియేషన్ గణపవరం మండల శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. భీమవరానికి చెందిన మానసిక వైద్యనిపుణులు కార్తీక్‌వెంకటేశ్, నాగవేణి ప్రపూర్ణల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పీఎంపీల సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారు నిడమర్తి జయసూర్య, జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే. పరమేశ్వర్లు మాట్లాడుతూ 18వ తేదీన తాడేపల్లిగూడెంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. అవగా హన సదస్సులో గణపవరం మండల పీఎంపీల సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ మూర్తి, మండల కార్యదర్శి శివ శ్రీనివా సరావు, జాయింట్ సెక్రటరీ కేటీఎస్, కోశాధికారి అప్పారావు పాల్గొన్నారు.

'ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్మానాలు చేశాం'

పెనుమంట్ర, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వానికి అనుకూలంగా అవసరమైన తీర్మానాలను పెనుమంట్ర గ్రామపంచాయతీ పాలకవర్గం ఆమోదించడం జరిగిందని సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక తెలిపారు. కానీ గురువారం రాత్రి పెనుమంట్రలో జరిగిన పల్లె పల్లెకు మన పితాని కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణను తప్పుదోవ పట్టించే విధంగా అవాస్తవాలను చెప్పారని ప్రియాంక ఆరోపించారు. శుక్రవారం పెనుమంట్ర గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. 2024 అక్టోబరు 13న ఆర్థిక సంఘం నిధులు నాలుగు లక్షలతో నిర్మించే ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసిందని, కాని పాలకవర్గం సహకరించడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడం దురదృష్టకరమన్నారు.

విద్యార్థులు సోదరభావంతో మెలగాలి


విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శనలు

ఆకివీడు రూరల్ అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): కళాశాల అంటే కుటుంబంలాంటిదని అందరూ సోదరభావంతో మెలగాలని వక్తలు అన్నారు. దుంపగడపలోని వివిగిరి ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్‌డే కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో చదువుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భిన్నమైన అభిరుచులు కలిగినవారు వస్తారని, వారి ఆలోచనలు పంచుకుంటూ లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత, వైస్ ప్రిన్సిపాల్ యోగేశ్వరరావు పాల్గొన్నారు.

కుళాయిలో మురుగు నీరు



ఆకివీడు, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ కుళాయిల ద్వారా సరఫరా చేసే తాగునీరు మురుగునీరుగా వస్తున్నది. స్థానిక ఎస్ టర్నింగ్‌లోని సంగీతా థియేటర్ ప్రాంతంలో నెల రోజుల నుంచి ఇదే విధంగా వస్తుండడంతో అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా ఫలితం ఉండడంలేదని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. పన్నులు సక్రమంగా చెల్లించకపోతే బంద్ చేస్తారు, అధికారులు కూడా నిబంధనలు పాటించాలని ప్రజానీకం కోరుతున్నది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైసీపీ కోటి సంతకాల ఉద్యమ పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్లు చూపుతున్న వైసీపీ నాయకులు

ఆచంట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం పోస్టర్‌లను శుక్రవారం తూర్పుపాలెంలోని వైసీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. పార్టీ అధినేత జగన్ పిలుపు మేరకు అక్టోబరు 10 నుంచి నవంబరు 22 వరకు నియోజకవర్గంలో 50 వేల సంతకాలు సేకరణ చేపట్టనున్నామని తెలిపారు.

కాళ్ల: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తే ప్రజల తరపున తీవ్రంగా వ్యతిరేకిస్తామని వైసీపీ ఉండి ఇన్‌చార్జి పీవీఎల్ నరసింహరాజు తెలిపారు. పెద అమిరంలోని వైసీపీ కార్యాలయంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో భాగంగా బ్రోచర్ల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో తొలి సంతకాన్ని పీవీఎల్ చేశారు.

'జీఎస్టీ వల్ల సామాన్యులకు లాభం లేదు'

ఆచంట,అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):జీఎస్టీ తగ్గింపు వల్ల సామాన్య ప్రజలకు ఒరిగింది ఏమి లేదని కేవలం ధనవంతులకు ఏసీలు, మోటారు సైకిళ్లకు మాత్రమే ధరలు తగ్గాయని ఆచంటకు చెందిన రైతు సంఘం నాయకుడు నెక్కంటి కృష్ణమూర్తి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం సామాన్యులకు పనికి వచ్చే నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని అన్నారు. జీఎస్టీ తగ్గిన తరువాత ఏ సరకు ఎంత వరకు తగ్గిందో ప్రతి షాపు వద్ద బోర్డు పెడితే సామాన్యులకు ఎంత మేలు జరుగుతుందో తెలుస్తుందన్నారు.

17,18 తేదీల్లో ఏఐటీయూసీ సమావేశాలు

తాడేపల్లిగూడెం, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి):ఈనెల 17, 18 తేదీల్లో తాడేపల్లిగూడెంలో నిర్వహించే ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలు విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దూసనపూడి సోమసుందర్ పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ సమావేశం కడకట్లలో ఏరియా కమిటీ అధ్యక్షుడు ఓవీరాజు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సోమసుందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న సుమారు 3లక్షల మంది ఏఐటీయూసీ అనుబంధ సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్మిక రంగ సమస్యల సాధన కోసం కౌన్సిల్ సమావేశాల్లో చర్చించి పోరాటలకు సన్నద్ధమవుతామని స్పష్టం చేశారు. సమావేశంలో ఎం.హరీష్, కళింగ లక్ష్మణరావు ప్రసంగించారు.

రేపు అన్నపూర్ణాదేవికి వెండిమకర తోరణం అలంకారం

భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):గునుపూడిలోని సోమేశ్వరాలయం ట్రస్టు బోర్డు సభ్యులు శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబును కలిశారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 11-30 గంటలకు అమ్మవారికి సుమారు రూ. 30 లక్షలు విలువ కలిగిన 19.5 కేజీల వెండితో తయారు చేసిన మకర తోరణం అలంకరణ చేస్తున్నట్టు ఎమ్మెల్యేకు తెలిపారు. ఆలయ చైర్మన్ చింతలపాటి బంగార్రాజు మాట్లాడుతూ అమ్మవారికి వెండి మకర తోరణాన్ని పట్టణానికి చెందిన బొండా వెంకట సుబ్రహ్మణ్యం (బుజ్జి బాబు) అందిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో దేవస్థాన పాలకవర్గ సభ్యులు యార్లగడ్డ రమేష్, పెద్దింటి చరణ్, ఆలయ ఈవో రామకృష్ణంరాజు, అర్చకులు రామకృష్ణ పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబును కలిసిన కంతేటి



భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి):సచివాలయంలో సీఎం చంద్ర బాబును భీమవరం వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ కంతేటి వెంకట్రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సేవా కార్యక్రమాలపై చర్చించి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొన్న పీ-4 కార్యక్రమాలను విజయవంతం చేయాలని సీఎం కోరారని కంతేటి తెలిపారు. ఇటీవలే స్వచ్ఛ ఆంధ్రా అవార్డు అందుకున్న కంతేటిని సీఎం చంద్రబాబు అభినందించారు.

ప్రకృతి సాగును ప్రోత్సహించాలి: కలెక్టర్



భీమవరం రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి సాగుతో పండించిన కూరగాయలను ప్రోత్సహించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుదలకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం భీమవరం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమై ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయలు వినియోగంలోకి తీసుకురావడంపై సమీక్షించారు. ఒకప్పుడు సాంప్రదాయ వ్యవసాయం ద్వారా పండించిన రుచికరమైన, మేలైన కూరగాయలను వినియోగించేవారని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధిక పురుగు మందులు, ఎరువులు వాడిన రుచిలేని కూరగాయలను మాత్రమే వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనిద్వారా చిన్న వయస్సులోనే కిడ్నీలు, క్యాన్సర్ తదితర వ్యాధులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అత్యుత్తమ పాలన చేస్తున్న చంద్రబాబు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు

భీమవరం టౌన్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే ధ్యేయంగా అత్యుత్తమ పాలన చేస్తున్న గొప్ప వ్యక్తి నారా చంద్రబాబు నాయుడని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళనాగేశ్వరరావు అన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా 15 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. జన్మభూమి పేరుతో ప్రజల వద్దకు పాలన తీసుకువచ్చారని, విద్యుత్ సంస్కరణలు చేపట్టి దేశంలో అత్యుత్తమ స్థాయికి రాష్ట్రాన్ని తీసుకువెళ్ళారన్నారు. ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు దేశంలోనే గొప్ప నాయకత్వ పటిమతో సమస్యలను అధిగమించారని గుర్తు చేశారు. సమావేశంలో నాగిడి తాతాజీ, విజ్జురోతి రాఘవులు, పెన్మెత్స రమేష్‌రాజు, చింత కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆచంట వైసీపీ అధ్యక్షుడిగా పెచ్చెట్టి

ఆచంట, అక్టోబరు10(ఆంధ్రజ్యోతి):ఆచంట వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షులుగా పెచ్చెట్టి సత్యనారాయణను నియమించినట్లు మండల వైసీపీ కన్వీనర్ జక్కంశెట్టి చంటి తెలిపారు. శుక్రవారం ఆచంటలో వైసీపీ గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కర్రి వాసు, కర్రి వేణుబాబు, ముప్పాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏ గ్రేడ్ ధాన్యం ధర రూ.2389

యలమంచిలి, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): సార్వా సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిబ్బంది అన్నిజాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి డి.బాలత్రిపురసుందరి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సిబ్బందికి శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఏవో డి.బాలత్రిపురసుందరి పాల్గొని మాట్లాడారు. ప్రతి రైతు ఈ-పంట నమోదు చేసుకోవాలని తద్వారా మాత్రమే రైతులు తమ ధాన్యాన్ని అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. 2025-26 సంవత్సరానికి ధాన్యం ఏ గ్రేడు మద్దతు ధరను క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 చొప్పున కేంద్రప్రభుత్వం మద్ధతు ధరను నిర్ణయించిందన్నారు. ముఖ్యంగా ఈ పంట నమోదు, ధాన్యం కొనుగోలులో తేమశాతం నిబంధనలను సిబ్బంది రైతులకు వివరించాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులైనా తలెత్తితే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని సూచించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ అజ్మీర మాట్లాడుతూ ధాన్యాన్ని రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాల కొరత ఉంటే స్ప్రెడ్ షీట్‌లో వెంటనే నమోదుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్ధారు డేవిడ్‌సన్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.